# చట్టం ముందు ఎవ్వరైనా ఒక్కటే..



- ఖమ్మంలో బాలిక ఘటన నిందితుని కఠినంగా శిక్షించి తీరాలి
-18 నిమిషాలకొక అత్యాచారం జరుగుతోందంటే సభ్య సమాజ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనం
- దేశంలో ఆడబిడ్డకు భద్రత ఎక్కడ?
- చట్టం బలపడాలి... నేరస్తుడు భయపడాలి
- రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఫౌండర్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చట్టం ముందు ఎవ్వరైనా ఒక్కటేనని, ఖమ్మంలో బాలికపై అత్యాచారయత్న ఘటనలో నిందితుని కఠినంగా శిక్షించి తీరాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఫౌండర్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా సయ్యద్ సాదిక్ అలీ మాట్లాడుతూ... ప్రపంచం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుంటే, మనం మరోవైపు వెళ్తున్నట్లుందన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు దేశ మనస్సాక్షిని ప్రశ్నిస్తున్నాయన్నారు. 2024లో దేశవ్యాప్తంగా 29,536 అత్యాచార కేసులు నమోదయ్యాయి. అంటే రోజుకు 80కు పైగా, గంటకు మూడు కంటే ఎక్కువ, ప్రతి 18 నిమిషాలకు ఒక మహిళ, బాలిక లైంగిక హింసకు గురవుతోందన్న మాట. ఇవి కేవలం గణాంకాలు కావు. ప్రతి సంఖ్య వెనుక ఒక కుటుంబం కన్నీరు, ఒక ఆడబిడ్డ ఛిద్రమైన భవిష్యత్తు దాగి ఉంది. అభివృద్ధి, సాంకేతిక ప్రగతి, ఆర్థిక వృద్ధి గురించి గొప్పగా చెప్పుకునే దేశంలో మహిళల భద్రత ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే ఉండటం బాధాకరం అన్నారు. రాష్ట్రాల వారీగా చూస్తే రాజస్థాన్ 4,871 కేసులతో మొదటి స్థానంలో ఉండగా, ఉత్తరప్రదేశ్‌లో 3,209, మహారాష్ట్రలో 3,091, మధ్యప్రదేశ్‌లో 3,061, దేశ రాజధాని ఢిల్లీలో 1,339 కేసులు నమోదయ్యాయి. మిగిలిన రాష్ట్రాల్లో కలిపి 13,765 కేసులు నమోదు కావడం పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తోంది. ఇవి కేవలం నమోదైన కేసులు మాత్రమే. కుటుంబ పరువు, సామాజిక ఒత్తిళ్లు, బెదిరింపులు, న్యాయవ్యవస్థపై భయం కారణంగా వెలుగులోకి రాని ఘటనలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ప్రతి 18 నిమిషాలకు ఒక అత్యాచారం జరుగుతోందంటే అది కేవలం నేర గణాంకం కాదు... సభ్య సమాజం వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనం. 2012 డిసెంబర్ 16న జరిగిన నిర్భయ ఘటన దేశాన్ని ఒక్కసారిగా మేల్కొలిపింది. లక్షలాది మంది యువత వీధుల్లోకి వచ్చి మహిళల భద్రత కోసం ఉద్యమించారు. చట్టాలు మారాయి. శిక్షలు కఠినమయ్యాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పడ్డాయి. అయినప్పటికీ 2017లో డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ కేసు, 2018లో కథువా బాలిక ఘటన, 2019లో దిశ ఘటన, 2020లో హాథ్రస్ ఘటన, అనంతరం వెలుగులోకి వచ్చిన పోక్సో కేసులు, మైనర్ బాలికలపై దాడులు, నకిలీ బాబాల దారుణాలు దేశాన్ని వరుసగా కుదిపేశాయి. ప్రతి ఘటన తర్వాత దేశం స్పందించింది. కొవ్వొత్తుల ర్యాలీలు జరిగాయి. సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తమైంది. కానీ బాధితుల కన్నీళ్లు ఆరకముందే ఖమ్మంలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇది ముమ్మాటికీ శిక్షర్హం దేశంలో కొందరు స్వయంఘోషిత బాబాలు, నకిలీ గురువులు భక్తి పేరుతో మహిళలను మానసికంగా వశపరచుకోవడం, బ్లాక్‌మెయిల్ చేయడం, లైంగికంగా దోపిడీ చేయడం వంటి ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. మహిళలపై జరుగుతున్న నేరాల్లో చాలావరకు నిందితులు అపరిచితులు కాకపోవడం మరింత భయంకరమైన విషయం. ముఖ్యంగా మైనర్ బాలికలపై పెరుగుతున్న పోక్సో కేసులు, పిల్లలకు చదువు మాత్రమే కాదు, భద్రతపై అవగాహన కూడా అవసరమని ప్రతి సంఘటన చెబుతోంది. "మంచి స్పర్శ చెడు స్పర్శ" గురించి అవగాహన కల్పించడం నుంచి, పిల్లలు భయపడకుండా సమస్యలు చెప్పగల కుటుంబ వాతావరణం కల్పించడం వరకు ప్రతి తల్లిదండ్రి బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది. తూటాకు దయాదాక్షిణ్యాలు ఉండవు... తారతమ్యాలు ఉండవు. చట్టం కూడా అలానే ఉండాలి. నేరస్తుడు ఎవరు? నేరస్తుడికి మతంతో సంబంధం ఉండకూడదు ఎంత ధనవంతుడు? ఏ రాజకీయ పార్టీకి చెందినవాడు? అనే తేడా లేకుండా చట్టం పనిచేసినప్పుడే బాధితుడికి న్యాయం జరుగుతుంది. విచారణల్లో జాప్యం, రాజకీయ ప్రభావాలు, శిక్షల అమలులో ఆలస్యం నేరస్తుల్లో ధైర్యాన్ని పెంచుతున్నాయి. "ఈ దేశంలో ఒక ఆడబిడ్డ భయపడకుండా ఎప్పుడు జీవిస్తుంది?" దేశం నిజంగా అభివృద్ధి చెందిందని చెప్పాలంటే ముందుగా ఆడబిడ్డకు భద్రత కల్పించాలి. మహిళలను గౌరవించడం సంస్కారం... మహిళలకు భద్రత కల్పించడం ప్రతి ప్రతి పౌరుడి ప్రథమ కర్తవ్యం. చట్టం బలపడాలి... నేరస్తుడు భయపడాలి... ఖమ్మంలో జరిగిన దారుణ ఘటనకు నిందితుడిని కఠినంగా శిక్షించాలి బాధితురాలికి న్యాయం జరగాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఫౌండర్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ కోరారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కుటుంబాన్ని పరామర్శించిన ఆరెపల్లి మోహన్..




**సిరిసిల్ల, జూన్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కుమారుడు ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో, మానకొండూరు మాజీ శాసనసభ్యులు, మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్ ఈరోజు సిరిసిల్లలో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావుకి మరియు వారి కుటుంబ సభ్యులకు ఆరెపల్లి మోహన్ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్పు పలికారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ, కుటుంబానికి జరిగిన ఈ తీరని లోటు బాధాకరమని పేర్కొంటూ, భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## బాలికపై లైంగిక దాడి దుర్మార్గచర్య

- నిందితున్ని కఠినంగా శిక్షించాలి
- ఖమ్మం నగరంలో తెలుగు మహిళల నిరసన ర్యాలీ



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం రాపర్తినగర్ ప్రాంతంలో 12ఏళ్ల బాలికపై లైంగిక దాడి ఆపై హత్యాయత్నం చేసిన ఉన్మాది గౌస్ పాషాని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని, బాదితురాలికి న్యాయం చేకూరేలా ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆకాంక్షిస్తూ తెలుగు మహిళ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా తెలుగుదేశంపార్టీ కార్యాలయం నుంచి తెలుగుమహిళల ఆధ్వర్యంలో గురువారం ప్లకార్డులు పట్టుకుని పాదయాత్రగా ఉన్మాదిని వెంటనే కఠినంగా శిక్షించాలని 'వి వాంట్ జస్టిస్' అంటూ ఎన్టీఆర్ సర్కిల్ లో రాస్తారోకో చేసి శాంతియుతంగా నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాళ్ళు రాచకొండ పావని, కామ అనిత, రంగిశెట్టి మంగమ్మ, తాడిశెట్టి స్వాతి, సౌలం లావణ్య, కూరపాటి సంధ్య, వీరితోపాటు టిడిపి జిల్లా నాయకులు హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్, వడ్డేం విజయ్, నున్నా నవీన్, కూచిపూడి జై, చింతనిప్పు నాగేశ్వరరావు, నల్లమల రంజిత్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళన కరపత్రం ఆవిష్కరణ



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఈనెల 21న హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర జరిగే తెలంగాణ ఉద్యమ కారుల సమ్మేళనం కరపత్రాన్ని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ రాష్ట్ర కార్యదర్శి, చిన్నారి హాస్పిటల్ అధినేత కె.వి కృష్ణారావుతో కలిసి తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గృహ నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలు, 25 వేల పెన్షన్ కోసం జరిగే ఈ పోరాటంలో తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు నక్క మహేష్, చందర్ నాయక్, మీసాల మహేష్ పాల్గొన్నారు.

## జిల్లా ఉపాధ్యక్షుడుగా తన్నీరు క్రిష్ణార్జునరావు



**కల్లూరు, జూన్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కల్లూరు మండలం నకు చెందిన తన్నీరు కృష్ణార్జునరావు ఎన్నిక చేయబడ్డారు. ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం 25 జిల్లా మహాసభలో తన్నీరు ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామని అన్నారు. ఉపాధి హామీ పథకం యధావిధిగా కొనసాగించేలా పోరాటాలు చేస్తామని, ప్రతి పేదకుటుంబానికి ఇల్లు ఇచ్చేలా పోరాటాలు చేస్తామని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని, పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కూలి రేట్లు పెంపుకోసం పోరాటం చేస్తామని చెప్పారు.

## ఖమ్మంలో 12 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

- ప్రజా సంక్షేమ వేదిక నాయకురాలు జి. కృష్ణవేణి



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన 12 ఏళ్ల బాలికపై జరిగిన అమానుష ఘటన పట్ల ప్రజా సంక్షేమ వేదిక నాయకురాలు జి. కృష్ణవేణి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక బాలికపై అత్యాచారానికి పాల్పడి, అనంతరం ఆమె ప్రాణాలకే ముప్పు కలిగించే విధంగా వ్యవహరించిన నిందితుడిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజాన్ని కలవరపెడుతున్నాయని, ఇలాంటి దారుణాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని అన్నారు. బాధిత బాలికకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి త్వరితగతిన తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, చిన్నారుల భద్రత విషయంలో ప్రభుత్వం, పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా ఉండాలని, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులు మరియు హింసాత్మక ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించి, బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఆమె పేర్కొన్నారు. పోక్సో చట్టం కింద నమోదైన ఈ కేసులో నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని ప్రజా సంక్షేమ వేదిక తరఫున కృష్ణవేణి ప్రభుత్వాన్ని మరియు పోలీసు అధికారులను కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.

## పరకాల ఎస్ఆర్ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్..

- విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం నూతన కార్యక్రమాల అమలుపై అవగాహనా..



**పరకాల, జూన్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని ఎస్ ఆర్ ప్రైవేట్ పాఠశాలలో పేరెంట్ మీటింగ్ నిర్వహించారు. 2026-27 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నూతన కార్యక్రమాలు అమలు చేయనునట్టు పాఠశాల ప్రిన్సిపల్ విజయ శ్రీ తెలిపారు. మీటింగ్ కి హాజరైన పేరెంట్స్ కి పాఠశాలలో అమలు చేసే నూతన కార్యక్రమలపై వివరించారు ..విద్యార్థులకు డిజిటల్ క్రమశిక్షణ,మొబైల్ అలవాటు నివారణ, మోరల్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్స్, స్వీయ క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, చేతిరాత మరియు కమ్యూనికేషన్ స్కిల్స్, అధ్యయన నైపుణ్యాలు మరియు కొత్త అభ్యాస పద్ధతులను ఈ సంవత్సరం అమలు చేస్తున్నట్టుగా ఆమె తెలిపింది. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ....మోరల్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్స్ కోసం పాఠశాలలో ప్రత్యేక ట్రైనర్ను నియమించినట్టుగా, విద్యార్థుల మంచి విలువలు నైతిక బాధ్యత వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టుగా తెలిపారు. క్రమశిక్షణ వ్యక్తిత్వ వికాసం కోసం విద్యార్థుల్లో గౌరవభావం, సానుకూల ప్రవర్తన పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని, బాధ్యతాయుతమైన ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు మార్గ నిర్దేశనం చేయబడునని అన్నారు. అదే విదంగా పిల్లలకు చక్కని చేతి రాత, కమ్యూకేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్ పై ప్రత్యేక దృష్టి సరించబడునని తెలిపారు. పిల్లలకు అధికంగా మొబైల్ వాడకం పై కలిగే నష్టాలపై అవగాహనా కల్పించడం, కొత్త అధ్యాయన పద్ధతులు సమర్థవంతమైన చదువు సాంకేతికతలను పరిచయం చేయబడుతాయాని తెలిపారు. పాఠశాలలో కోఆర్డినేటర్లు, అకాడమిక్ డీన్, స్టేట్ కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక సెషన్లు నిర్వహించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు. అదే విదంగా విద్యార్థులపై తల్లి తండ్రులు కూడా ఇంటి వద్ద ప్రత్యేక శ్రద్ధ అవసరం అని అన్నారు. మీటింగ్ కి హాజరైన పేరెంట్స్ ని కూడా వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకొని విద్యార్థుల భవిష్యత్ కోసం తల్లి తండ్రుల భాద్యత కూడా ఎంతో అవసరమని అన్నారు.

